# బియ్యే!... నీ విలువెంత?

**• ఓ. లక్ష్మణాచార్య •**

తూర్పు ఎర్రబడి అప్పటికి మూడు గంటలు దాటింది.

వేసవి కాలం !

ఆకలితో దహించుకపోయే సింహం కళ్ళలోని చూపుల్లా... సూర్యకిరణాలు !

శేఖరం అతని ప్రక్కనున్న గడియారం చేతిని చూసాడు. తను బస్‌స్టాండుకొచ్చి అరగంటయింది. ఆశ్చర్యం వేయలేదతనికి.

బస్‌స్టాండునిండా జనం ! గుంపులు గుంపులుగా... నేల ఈనినట్లుగా...

ఉద్యోగస్తులు... స్టూడెంట్లు... మామూలు పాసింజెర్లు... రిక్షావాలాలు... అడవిలో ఒకే ప్రాంతంలో పుట్టిన రకరకాల చెట్లలా...

నీటుగా తయారై కాలేజీల కెళ్ళే కుర్రాళ్ళను చూస్తుంటే శేఖరం పెదవుల పై సన్నటి మందహాసం ! ఆ నవ్వులో "అయ్యో ! వీరెంత అమాయకులు !" అనే జాలి వుంది. 'ఎంత ఆశాజీవులు !' అనే భావం వుంది.

'బడి రోజులు బంగారు రోజులు...' అనే మాటను పెద్దవాళ్ళెందుకన్నారో చదువుకునే రోజుల్లో తన కర్థం కాలేదుగాని, ఇప్పుడు అక్షరాలా నిజమనిపిస్తోంది. 'ఆ మాట నాలాంటివారికొరకె పుట్టిందేమో' అని ఇదివరలో రెండు మూడు మార్లు కూడా అనుకున్నాడు — శేఖరం.

శేఖరం పాతికేళ్ళ పడుచువాడైనాగాని జీవితానుభవంలో వయస్సు మీరినవాడే.

అతడిని, అతని చేతిలోని ఫైలును ఎవరైనా చూస్తే 'భారతంలోని నిరుద్యోగి' అనే చిన్న 'స్కెచ్'ను వ్రాసి ప్రచురణ కోసం పంపడం ఖాయం.

ఉన్న ఒక్క చొక్కా ప్యాంటును జాగ్రత్తగా వుతికి, (లేకపోతే చిరిగిపోతుందని భయంలెండి) ప్రక్క ఇంటివాళ్ళను రిక్వెస్టు చేసి తెచ్చిన ఐరన్ బాక్సుతో అతిజాగ్రత్తగా ఇస్త్రీ చేసి, ఎంప్లాయ్‌మెంటు ఆఫీసరుకు కాస్త 'నీట్'గా అగుపడాలని తాపత్రయపడే శేఖరం ప్రయత్నం విఫలమే అయింది. ఎండ వేడిమికి శరీరమంతా చెమట పట్టి అప్పటికే పూర్తిగా తడిసిపోయిందంటే నమ్మండి.

అతడి కాళ్ళకు... అరిగిన స్లిప్పర్లు !... ముసలి మొఖానికి వయసు రంగు పులిమినట్లుగా...

అతడి మొగం సూర్యునితో జలకాలాడటంతో, ఆరోజే సున్నగా గీసిన గడ్డం కాస్త మంటమండింది... గాయంపై కారం చల్లినట్లుగా...

చేతిలోని ఫైలును తెరచి మరొక్కమారు చూసుకున్నాడు — కావల్సిన సర్టిఫికేట్లు వగైరా అన్నీ వున్నాయో లేదో అని.

దాన్ని జాగ్రత్తగా మూసి కన్నకూతుర్ని పట్టుకున్నట్టుగా పట్టుకున్నాడు.

శేఖరానికి ఆ ఫైలే జీవనాధారం !

తన బియ్యే చదువంతా దాంట్లోనే వుంది.

ప్రక్కనున్న పల్లెటూరి బడిలో పంతులుగిరీ వెలగబెడుతూ ఎంతో ఆశగావున్న అతని తండ్రి కోరికలన్నీ దాంట్లోనే వున్నాయి.

"ఒరే శేఖరం ! నీ చదువయిపోయి నీకో ఉద్యోగం వచ్చింతర్వాతయినా పడిపోయిన మన వంటింటి గోడను తిరిగి కట్టుకోవాలిరా..." తను బియ్యే మొదటి సంవత్సరం చదువుతూండగనే తన అమ్మ ఆశించే ఆశలు కూడా దాంట్లోనే వున్నాయి.

"ఏమిట్రా శేఖరం ! నీ చదువెప్పుడయిపోతుంది ? ఎప్పుడుద్యోగం వస్తుంది ? నీ వుద్యోగం కొరకు మా సరోజ వేయి కళ్లతో చూస్తోంది..." అవి తన మేనత్త అనే మాటలు. సరోజతో జరగబోయే తన పెళ్ళి కూడా ఈ ఫైలుమీదే ఆధారపడి వుందంటే ఈ ఫైలు తన జీవితానికెంత ముఖ్యమో తనకే తెల్సు !

శేఖరం ఇంకా బస్‌స్టాండులోనే వున్నా గడియారంలోని రెండు ముల్లులు మాత్రం పోటీపడి తిరుగుతున్నాయి.

గడియారం ముల్లులకూ, సూర్యుడి మూమెంటుకూ ఆయాసం లేదని ఊరికే అన్నారా? తనొచ్చి గంటయినా బస్సు రాలేదంటే అతడికేకాదు అక్కడున్న ఎవ్వరికీ ఆశ్చర్యం వెయ్యలేదు. ఆర్టీసీ బస్సులు ! అందునా వరంగల్ — కాజీపేట మధ్య తిరిగే ఈ బస్సుల రాకపోకల సంగతి సర్వలోక విదితమే ! వస్తే ఒకదాని వెనుక ఒకటి, ముచ్చట్లు చెప్పుకుంటూ... చీమల బారులా... రైలు డబ్బాల్లా... కలిసివెళ్ళే మిత్ర బృందంలా...ముఖం తుడుచుకున్నాడు శేఖరం... క్రాపు సరిచేసుకున్నాడు.

ఆయాసపడుతూ వచ్చి ఆగింది బస్సు... తొమ్మిదినెల్లు నిండిన గర్భవతిలా...

దానిలోపలే కాదు, బయటా జనమే !

ఎదురుచూస్తున్న శకటం ఎదుట నిలవగానే బెల్లం చుట్టూ ఈగలయ్యారు... బస్సు చుట్టూ జనం !

ఎక్కే పాసింజర్లలో ఓ కురుక్షేత్ర సమరం !

కాలరు సరిచేసుకొని శేఖరం 'డోరు' దగ్గరికి నడిచాడు— యుద్ధానికి వెళ్ళే వీరయోధునిలా.. వెళ్ళేముందు ఇంట్లోంచి బయలుదేరేటప్పుడు పెట్టుకున్న ఐదు రూపాయల కాగితం జేబులో వుందని నిర్ధారణ చేసుకున్నాడు. కాని మన శేఖరం యుద్ధం ప్రారంభించకుండానే బస్సుకాస్త మెల్లగా కదిలింది... కప్పల్ని దిగమింగిన పాములా...

టైం — పదింబావు !

బియ్యేప్యాసైన మూడుసంవత్సరాలకు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసునుండి 'కాల్' రావడం ఇదే మొదటిసారి! అందుకే అతనేగాదు, అతని నాన్నా సంతోషపడ్డాడు. అమ్మా, అత్తయ్యలతోపాటు సరోజకూడా సంతోషపడింది. ఈ మూడు సంవత్సరాల్లో ఉద్యోగం వచ్చేమాట దేవుడెరుగుకాని వాటికి దరఖాస్తులు పెట్టుకోవడానికి మాత్రం తక్కువలో తక్కువ ఓ అర్థశతం ఖర్చయి వుంటుంది. వస్తుందనుకున్న ఉద్యోగంకాస్త 'ఉత్తర దక్షిణాలు' ఉన్నవారికో; ఫోనులో మ్రోగే ఖరీదైన గొంతుకో పోవడం శేఖరానికి తెల్సు. అయినా శేఖరానిది ఏం చెయ్యలేని స్థితి !

ఇంటర్వ్యూ స్థలం కలెక్టరాఫీసని, సమయం పదకొండు గంటలకని ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరు ఆదేశం !

మొదటి కాల్ !... క్రొత్త మురిపెం ... పొద్దెరగదు ...

తొమ్మిది గంటలకే వచ్చాడు—పదింబావయింది

"రిక్షా కావాలా ... సార్ ... " రిక్షావాలా అర్థింపు !

ఆలోచనల్లోంచి బయటికొచ్చాడు శేఖరం. రిక్షావాలాను చూసాడు.

పాత చొక్కా, మోకాళ్ళ వరకూ మలచిన మాసిన కాకిరంగు ప్యాంటు, పెరిగిన గడ్డం ..

మళ్ళీ అడిగాడు రిక్షావాలా.

"కలెక్టరాఫీసుకెంత తీసుకుంటావ్ ..." జేబులోని డబ్బుల్ని తడిమి చూస్తూ అడిగాడు శేఖరం.

"రెండ్రూపాయలివ్వండి బాబూ ... "

"రూపాయిన్నరిస్తాను ... "

సీటును తుడిచాడు రిక్షావాలా — ఎక్కి కూర్చున్నాడు శేఖరం.

"పదకొండు గంటలకు ఇంటర్వ్యూ వుంది –

కాస్త త్వరగా పోనీయ్ ..." విన్న రిక్షావాలా పెదవులపై జీవంలేని నవ్వు!

శేఖరం ఆ నవ్వుని గమనించినా అందులోని అర్థాన్ని గ్రహించలేకపోయాడు.

రిక్షా వేగంగానే పోనిస్తున్నాడు. గాంధీ హాస్పిటల్ ... సూపర్ బజార్ ... వేయి స్తంభాల గుడి ... హన్మకొండ ... వెనక్కు వెళుతున్నాయి.

జాలేసింది శేఖరానికి. అలా జాలి వేయడం అతనికి సహజం!

ప్రొద్దస్తమానం రిక్షా త్రొక్కడం, సరిపోని ఆదాయంతో సంసారం సాగించడం.

"రోజూ ఎంత సంపాదిస్తావోయ్ ..."

ఆశ్చర్యంగా చూసాడు రిక్షావాలా.

"మంచి సవారొస్తే ఇరవై ... మామూలుగా అయితే పదిహేను. అందులో ఐదు కిరాయి గట్టాలి ..."

నిరాశ ధ్వనించింది అతడి గొంతులో.

'చదువుకోకపోవడం వాడి దురదృష్టం! శారీరకంగా ఎంత శ్రమపడాల్సి వస్తోంది! అయినా జీవితం అతుకుల బొంతే ...'

ఆలోచిస్తున్నాడు శేఖరం.

తన ఫైలును చూసుకున్నాడు – తృప్తిగా నిట్టూర్చాడు. ఇవ్వాల్టితో తనకూ ఒక ఉద్యోగం వస్తే తన కాళ్ళమీద తను నిలబడగలుగుతాడు. ఆ తర్వాత సరోజను పెళ్ళి చేసుకుంటే హాయిగా కాకపోయినా మామూలుగానైనా జీవితం గడిచి పోతుంది కాని ఇంత దుర్లభం అనిపించదు.

పదిన్నర దాటింది... పదకొండు కంటే ముందే చేర్చడానికి తన శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు రిక్షావాలా. మాసిన చొక్కా అంతా 'శ్రమ'తో తడిచిపోయింది.

వేగంగా పోతోంది రిక్షా... ఎదురుగా వేగంతో వస్తోంది జీపు! అంతే! శేఖరం వూహించలేదు ఆ సంఘటన. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

రిక్షా ఓ చక్రానికి జీపు తగిలింది.

జీపు అదే వేగంతో వెళ్ళిపోయింది–ఆగకుండా. పోలీసును చూసిన దొంగలా ...

రిక్షా ప్రక్కకు ఒరిగిపోయింది – ఆసామితో దెబ్బలు తిన్న కూలీలా ...

రిక్షావాలా తల రోడ్డు ప్రక్కనవున్న మైలు రాయికి విసురుగా తగిలింది.

మైలురాయి చెదరలేదు – తన మొఖానికి రిక్షావాలా రక్తాన్ని పూసుకుంది. రిక్షావాలాకు స్పృహ లేదు. మొదలు నరికిన చెట్టులా ... రిక్షావాలా శరీరం!

మూసిన కళ్ళు తెరిచాడు శేఖరం.

గడిచింది క్షణమే... కాని జరిగింది ఘోరం!

తనను చూసుకున్నాడు – రోడ్డుకు దిగువగా వున్న కుంట ప్రక్కన!

చుట్టూ చూసాడు... ఆశ్చర్యంతో, జాలితో గుమికూడిన జనం!

తనకు ప్రమాదం జరక్కపోవడం అదృష్టం

మెల్లగా లేచాడు శేఖరం...రిక్షావాలా దగ్గరకు నడిచాడు. రక్తం బాగానే పోయింది వింతగా చూస్తున్నారే గాని ముందుకు రావడం లేదెవ్వరూ

ప్రక్కనున్నతని టైం చూసాడు శేఖరం పదకొండుకు పావుగంట వుంది. భయం వేసింది - ఏం చెయ్యాలో తోచని స్థితి!

ఒక ప్రక్క ఇంటర్వ్యూ మరో ప్రక్క పడిపోయిన రిక్షావాలా . .

ఆ ప్రక్క తనకు రాబోయే ఉద్యోగం ఈ వేపు కాపాడవల్సిన జీవితం శేఖరం కళ్ళు జాలిగా అతడిని చూసాయి... దూరంగా పడివున్న సర్టిఫికేట్ల ఫైలునూ చూసాయి.

"అయ్యో పాపం! తలకు బాగానే దెబ్బ తగిలింది ..."

"ఎంత ఘోరం జరిగిపోయింది– రక్తం బాగా కారుతోంది ..."

"అసలెలా జరిగిందీ ఘోరం?"

"తొందరగా హాస్పిటల్లో చేర్పించాలి లేకపోతే ప్రమాదం ..."

గుంపులోని జనం ఒక్కొక్కరు ఒక్కొక్క మాటనుకుంటున్నారు. ముందుకు వచ్చేవారు శూన్యం!

అటువేపు పోతున్న మరో రిక్షావాలా పరుగు పరుగున వచ్చాడు ...



తాజావార్తలకు, ప్రత్యేక శీర్షికలకు, వైవిధ్యంగల వ్యాసాలకు

ఆంధ్రపత్రిక దినపత్రిక చదవండి.



రు. 100 ఆదా చేయండి

30 రోజులు ట్రైల్ ఉచితం. భారత దేశంలో ప్రప్రథమం

అత్యంత సుందరమైన సరికొత్త టు—ఇన్—వన్ టైపు 2 బ్యాండ్ ట్రాన్సిస్టర్ ప్రత్యేక ఎల్. ఇ.డి. & ఎ/సి సాకెట్లతో సహా రూ. 280/- విలువైనది. అన్ని పన్నులతో చేరి రు. 180 మాత్రమే. లైసెన్సు అవసరంలేదు. వి.పి.పి. ద్వారా ప్రతిగ్రామం పట్టణానికి పంపబడుతుంది. రెండేండ్ల గ్యారంటీ. విరామ సమయమునందు నెలకు రు. 500 నుండి 1000 వరకు సంపాదించుటకు స్కీము కూడ గలదు. ఇంకను రు. 20,000 విలువగల బహుమతులు పొందండి

మీ అడ్రసు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయండి. నేడే మీ ఆర్డరు పంపండి.

**MAHARAJA ELECTRONICS (W.A.P.)**

D.49. Arjun nagar, S.J. Enclave, New Delhi-29.



# క్యాన్సరు విముక్తి

నాపేరు శ్రీమతి కుట్టేటి నంజమ్మ. వయస్సు 44 సంవత్సరములు. సంతానము ఇద్దరు మగపిల్లలు. 1977వ సంవత్సరములో నా కడుపులో నొప్పి ప్రారంభమైనది. మైసూరులో డాక్టర్లకు చూపించగా గర్భకోశ వ్యాధి అని ఆపరేషను చేసినారు. తరువాత కొద్ది రోజులకు నా కడుపులో మళ్లీ నొప్పి రాగా డాక్టర్లు నన్ను పరీక్ష చేసి క్యాన్సరు ఆస్పత్రికి పంపిరి. అక్కడ నన్ను పరీక్ష చేసి గర్భకోశ క్యాన్సరు అని 14 సార్లు కరెంటు చికిత్స చేసిరి. అయినా వ్యాధి తగ్గలేదు. ఒక రోజు వార్తా పత్రికలో డాక్టరు బాబురావు గారి ఆయుర్వేద చికిత్సవలన క్యాన్సరు నయమయినట్లు ఒక రోగి ప్రకటించిన ప్రకటన చూసి, నేను చిక్కడపల్లిలోని డాక్టరు బాబురావు గారిని సంప్రదించి 12 వారములు మందు వాడగా నాకు ఉన్న బాధలన్నీ పూర్తిగా తగ్గినవి. తరువాత నేను మళ్లీ క్యాన్సరు డాక్టరుచే పరీక్ష చేయించగా నాకు క్యాన్సరు లేనట్లు నిర్ధారించిరి. ఇప్పుడు నా పిల్లలతో మరియు నా భర్తతో హాయిగా కాలము గడుపుచున్నాను. ఇటువంటి భయంకరమైన రోగము నుండి డాక్టరు బాబురావుగారు రక్షించినందుకు నేను ఆయనకు ఎంతో ఋణపడి వున్నాను.

ఇట్లు,

**కుట్టేటి నంజమ్మ, C/o ఫాన్సీ పూవయ్యా,**

స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా., సెంట్‌మార్క్స్ రోడ్ బ్రాంచి, బెంగుళూరు—1.

| డాక్టరుగారి అడ్రసు | ఫోన్ నెంబరు | సంప్రదించు రోజులు |
|---|---|---|
| **డా. ఎం. బాబురావు,** క్యాన్సరు ఇన్‌ఫర్మరీ, ఇంటి నెంబరు : 1-1-271/3, చిక్కడపల్లి, హైదరాబాదు—20. | 64735 | ప్రతి గురువారం & శుక్రవారం |
| C/o హోటల్ సుధాకర్, ఉస్మాన్ రోడ్, టి. నగర్ మద్రాసు—17. | 445164 | ప్రతి శనివారం |
| C/o హోటల్ బృందావన్, ఎం.జి. రోడ్, బెంగుళూరు—1. | 53271 | ప్రతి ఆదివారం |



## "బియ్యే !...నీ విలువెంత ?"

పడిపోయిన వాడిని రిక్షాలోకి ఎక్కించాడు శేఖరం లేచాడు.

"మీరూ కూర్చోండి బాబుగారూ... హాస్పిటలుకు తీసుకపోదాం..."

అప్రయత్నంగా ఎక్కి కూర్చున్నాడు శేఖరం... తన నిర్ణయం సబబే అనుకున్నాడు.

రిక్షావాలాను — హాస్పిటల్‌లో చేర్పించారు.

గంటయింతర్వాత స్పృహ వచ్చింది రిక్షావాలాకు.

"బాబూ... మీరు చేసిన సహాయానికి చాలా కృతజ్ఞతలు... మెనీ మెనీ థాంక్స్!..."

ఆశ్చర్యంగా అతడి కళ్ళలోకి చూసాడు శేఖరం ఆ ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే మళ్ళీ అన్నాడతను.

"ఈ హాస్పిటల్‌కు ముందున్న సందులోనే మా ఇల్లు — ఎవర్నడిగినా చెప్తుతారు — నాకు తెలిసినవారు ప్రస్తుతం మీరొక్కరే. బాబూ... మీరేమనుకోకపోతే దయచేసి మా ఇంటికెళ్ళి ఈ విషయం మా ఆవిడతో చెప్పండి... ప్లీజ్..."

అర్థింపు ధ్వనించింది అతడి గొంతులో.

ఎదుటివాళ్ళలో జాలి, దయ కలిగించే శక్తి వుంది అతడి కంఠంలో.

లేచాడు శేఖరం — హాస్పిటల్ బయటికి వచ్చాడు.

రిక్షావాలా ఇచ్చిన ఆనవాళ్ళనుబట్టి ఇల్లు తొందరగా దొరికింది.

కూలిపోతున్నట్టుగా వున్న చిన్న పెంకుటిల్లు! ఇంటిచుట్టూ మాత్రం శుభ్రంగా వుంది.

ఇంటిముందు ఆడుకుంటున్న పదేళ్ళ పిల్లాణ్ణి పిలిచి అడిగాడు 'రిక్షా రాములు ఇల్లు ఇదేనా' అని...

అవునన్నట్లు తలూపి ఇంట్లోకి వెళ్ళి వాళ్ళమ్మతో చెప్పాడు.

భర్తకు జరిగిన ప్రమాదం విన్న ఆవిడ కంగారుగా పరుగెత్తింది — తుపాకీ శబ్దం విన్న పక్షిలా...

బయటికొస్తున్న శేఖరం కళ్ళు ఆ ఇంట్లో గోడమీద నిలిచాయి. అప్పటి అతడి మొగాన్ని బాపులాంటి ఆర్టిస్టు కుంచెతో చిత్రించి దానికి "ఆశ్చర్యాంబుధిలో..." అనే వ్యాఖ్య వ్రాసి దానిని పోటీకి పంపిస్తే ప్రథమ బహుమతి — ఖాయం.

దుమ్ము పట్టివున్న ఫొటో ఫ్రేములో నాన్నాళ్ళ క్రితం అమర్చిన ఓ సర్టిఫికేటు... కూలిపోయిన రాచరికానికి చిహ్నంగా మిగిలిన కోట బురుజులా...

దాన్ని పరీక్షగా చూసాడు శేఖరం.

"కె. రామారావ్... పాస్డ్ బి. ఎ. ఇన్ 1969..." అనేది దాని సారాంశం.

హాస్పిటల్ బెడ్‌పై పడుకున్న రిక్షా రాములు శేఖరం కళ్ళముందు నిలిచాడు.

తన చేతిలోని ఫైలును తెరిచాడు.

తను 1979లో ప్యాసైన బియ్యేకు ఇచ్చిన సర్టిఫికేటులోని అక్షరాలు తనను హేళనచేస్తూ నవ్వుతున్నట్లనిపించింది.

అక్కడినుండి కదిలాడు శేఖరం.

అతడి మొగంలో — ఓ నవ్వు! జీవంలేని నవ్వు... మధ్యతరగతి మందహాసం !... ★